క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ


ఉద్యోగులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని చిత్తూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను, ఇటీవల ప్రమాదవశాత్తు పడిపోయిన ప్రహరీ గోడను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కూలిపోయిన ప్రహరీ గోడను త్వరితగతిన నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ, సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఏఓ భాస్కర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేకల చిన్నేపల్లెలో మధ్యాహ్న భోజనం..


భోజనం వడ్డిస్తున్న వైస్ ఎంపీపీ

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం పెడుతున్నారా, లేదా? అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం నాడు–నేడు పనులను పరిశీలించారు. హెచ్‌ఎం నాగమల్లిక, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

31వరకు విధుల బహిష్కరణ

పుంగనూరు: ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోర్టు విధులు ఈ నెలాఖరు వరకు బహిష్కరిస్తున్నట్టు న్యాయవాదులు తెలిపారు. శుక్రవారం కోర్టులో న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ట్యాబ్‌లు


ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన ముగ్గురు విద్యార్థులకు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా ట్యాబ్‌లను పులిచెర్ల ఎంఆర్‌సీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.36,500 వేలని చెప్పారు. వీరి అభ్యసనకు అనుగుణంగా ఈ ట్యాబ్‌లను ప్రభుత్వం రూపొందించిందని, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించి ట్యాబ్‌లను ఇస్తోందన్నారు. పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య పాల్గొన్నారు.

కరెంటు షాక్‌కు గురైన యువకుడు మృతి

పుంగనూరు: కరెంటు షాక్‌కు గురైన పట్టణంలోని మేలుపట్లకు చెందిన లతీఫ్ (22) తిరుపతిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈనెల 11న అతడు కరెంటు షాక్‌కు గురవడం విదితమే. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. లతీఫ్ మృతి చెందాడనే సమాచారం తెలియడంతో అతడి భార్యాపిల్లల రోదనలు పలువురినీ కలచివేశాయి.

భూ పంపిణీకి రికార్డులు సిద్ధం చేయండి



రొంపిచెర్ల: భూ పంపిణీ చేయడానికి రికార్డులను వీఆర్వోలు సిద్ధం చేయాలని తహసీల్దార్ అమరనాథ్ ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో భూ పంపిణీ కార్యక్రమంపై వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నిరుపేదలు సాగు చేసుకుంటున్న బంజరు భూములను డీకేటీ పట్టాలుగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. భూమి లేని నిరుపేదలకు మాత్రమే ఒకరికి 2.5 ఎకరాలు ఇస్తుందని, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు భూములను పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. డీటీ లోకేష్, ఆర్‌ఐ అబ్దుల్ ఖాదర్, వీఆర్వోలు పల్లవి, మహేష్, ప్రసాద్, శ్రీనివాసులు, వెంకటరమణ, ఎల్లప్ప, సురేంద్ర ముబారక్ బాషా పాల్గొన్నారు.

బాలోత్సవ కమిటీ ఏర్పాటు

పలమనేరు: స్థానిక కళామందిరంలో శుక్రవారం బాలోత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా తులసీనాథం నాయుడు, ఉపాధ్యక్షులుగా ధనుంజయ, మల్లిచెట్ల దేవేంద్ర, భాస్కర, శివశంకరయ్య, పుష్ప, నీలిమ, రూప, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్‌తో పాటు కార్యదర్శులు, గౌరవ సభ్యులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చేసిన మేలును చాటిచెప్పడమే లక్ష్యం

- నేడు పలమనేరులో సామాజిక సాధికార బస్సుయాత్ర
- పట్టణ నలువైపుల నుంచి ర్యాలీల హోరు
- ఏటీఎం సర్కిల్ వద్ద బహిరంగసభ
- భారీ జన సమీకరణలో ఆయా మండలాల నేతలు

పలమనేరు: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు పలమనేరు ముస్తాబైంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ క్యాడర్‌తో ఇప్పటికే సన్నద్ధం చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంక్షేమ పథకాలందాయి. సామాజిక న్యాయం కలిగేలా ఈ ప్రభుత్వం బడుగుల అభ్యున్నతికి పెద్దపీట వేసింది. నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాలతో బడుగుల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఈ నేపథ్యంలో బడుగులకు ఈ ప్రభుత్వంలో జరిగిన మేలు మరోసారి గుర్తు చేసుకుంటూ, జగనన్న రుణాన్ని ఎన్నటికీ మరచిపోమని చాటిచెప్పడానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహణకు పూనుకున్నారు.



సామాజిక సాధికార బస్సుయాత్ర లోగో

కార్యక్రమం ఇలా...

- శనివారం ఉదయం 11 గంటలకు గంగవరంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాలులో వివిధ వర్గాల వారితో సమావేశం.
- 12 గంటలకు కార్యక్రమంపై మీడియాతో నాయకుల సమావేశం
- మధ్యాహ్నం ఒంటిగంటకు గంగవరం నుంచి భారీ ర్యాలీగా బస్సుయాత్ర ప్రారంభం
- పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద బహిరంగ సభ
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు మంత్రులు పాల్గొననున్నారు.

ర్యాలీలు

- పలమనేరు రూరల్ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా రానున్నారు.
- పెద్దపంజాణి, గంగవరం మండలాల ప్రజలు గంగవరం నుంచి బస్సు యాత్ర ర్యాలీలో చేరుకుంటారు. వీ.కోట, బైరెడ్డిపల్లె మండలాల ప్రజలు చెరువుకట్టపై నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీగా వచ్చి బహిరంగ సభకు హాజరవుతారు. ఇప్పటికే ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమానికి భారీగా జనసమీకణ చేస్తున్నారు.

సభను విజయవంతం చేయండి



ఈ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు చేసింది. ప్రభుత్వం మనకు చేసిన మేలుకు కృతజ్ఞతగా నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్ర సభను నియోజకవర్గ పార్టీ క్యాడర్, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు పాల్గొని విజయవంతం చేయాలి.

–ఎమ్మెల్యే వెంకటేగౌడ

అండగా ఉంటాం.. ఆదరించండి


మహిళలకు చీరలు అందజేస్తున్న దుర్గ

కుప్పం: నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటాం.. నా భర్త ఎమ్మెల్సీ భరత్‌ను రాబోవు ఎన్నికల్లో ఆదరించండి.. అని ఆయన సతీమణి దుర్గ ప్రజలను కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ 22వ వార్డులో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. ఐదేళ్లుగా తన భర్త కుప్పంలోనే ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని, ప్రభుత్వం పథకాలు అర్హులందరికీ అందేలా చేశారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీకతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వంలో చంద్రబాబు పథకాలు అమలు చేసినా తీరును బేరీజు వేసుకోవాలని, ఈ ప్రభుత్వం ప్రజా, మహిళా పక్షపాతిగా పేరు తెచ్చుకుందన్నారు. మళ్లీ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయితే మరింత సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందుతాయన్నారు. అలాగే కుప్పంలో 35 ఏళ్లుగా చంద్రబాబును గెలిపిస్తున్నా ఆయన స్థానికంగా ఉండటం లేదని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఆ పార్టీ వారి జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. తమ కుటుంబం నుంచి మామ చంద్రమౌళి వరుసగా రెండుసార్లు పోటీ చేసి ఓటమి చవిచూశారని, ప్రజాసేవలోనే ఉంటూ ఆయన దివంగతులయ్యారని, ఆయన ఆశయ సాధన కోసం ఈ పర్యాయం ఎన్నికల్లో పోటీ చేస్తున్న తన భర్తకు ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్ధించారు. క్యార్యక్రమంలో 22వ వార్డు ఇన్‌చార్జి అరుల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్

చౌడేపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మేకలచిన్నేపల్లె, ఆమినిగుంట గ్రామాల్లో వికసిత్ భారత్ నిర్వహించారు. 17 రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పథకాల వారీగా మండల స్థాయి అధికారులు వివరించారు.



వాటికి సంబంధించి వీడియోలను ప్రదర్శించారు. పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాంకింగ్ చెస్ టోర్నీలో అనీషా ప్రతిభ



పుంగనూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న అనీషా రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీలో 2వ ర్యాంకు సాధించింది. శుక్రవారం హెచ్‌ఎం రుద్రాణి మాట్లాడుతూ, తిరుపతిలో నిర్వహించిన ఈ టోర్నీలో అనీషా సత్తా చాటిందని చెప్పారు. అనీషాను హెచ్‌ఎం, కోచ్ మణికంత, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వి.కోట: మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ సుద్దులకుప్పంలో సీసీ రోడ్ల పనులను శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ, సామాజికసేవ సలహాదారుడు అమరనాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నట్టు చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, సర్పంచ్ దామోదరం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న అమరనాథ్

సమస్యలు పరిష్కరించాలి


సమీక్షిస్తున్న నాయకులు, అధికారులు

సదుం: మండలంలో ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన సందర్భంగా గ్రామాల్లో ఆయనకు వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్, హౌసింగ్ తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయని వారు చెప్పారు. మొత్తం 22 వినతులు అందినట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు చిత్రపటాల ముందు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు


కుప్పం: పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

పెద్దపంజాణి: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన గొప్ప ఉద్యమకారుడు పొట్టి శ్రీరాములు అని హెచ్‌ఎం బాబు రెడ్డి కీర్తించారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని నాగిరెడ్డిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ లాంటి నాయకులతో కలసి పలు ఉద్యమాల్లో పాల్గొని దేశం కోసం జైలు జీవితం అనుభవించిన మహనీయుడు భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ అని చెప్పారు. అలుపెరగని కార్యదీక్షతో కాళ్లకు చెప్పులు, తలకు గొడుగు లేకుండా ఉద్యమించిన త్యాగజీవి పొట్టి శ్రీరాములు అని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, రాజేష్, బాబు, ఆంజప్ప, గంగాధరం పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఆమరణదీక్షతో ఆయన ప్రాణత్యాగం చేశారని స్మరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి, కౌన్సిలరు గణపతి, జగన్, సయ్యద్ ఆలీ, మోహన్, రాజ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ పరిశీలన

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి పరిశీలించారు. అలాగే అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సమస్యలపై భక్తులను ఆరా తీశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రమౌళి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు పలమనేరు విద్యార్థి


సునీల్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సునీల్‌కుమార్ సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. అతడిని ప్రిన్సిపల్, వైఎస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, విజయశేఖరం అభినందించారు. కర్ణాటకలోని బెళగావిలో జరిగే సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీలో సునీల్‌కుమార్ పాల్గొంటాడని వారు తెలిపారు.

వైభవంగా సదుమమ్మ ఊరేగింపు

సదుం: మండలంలోని నడిగడ్డలో శుక్రవారం గ్రామదేవత సదుమమ్మ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సదుమమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాలతో వాహనంలో నడిగడ్డ గ్రామానికి తీసుకువెళ్లారు. ప్రతి ఏటా అమ్మవారిని తీసుకువెళ్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల పాటు ఊరేగించడం ఆనవాయితీ అని, ఊరేగింపు ముగిసిన అనంతరం తిరిగి అమ్మవారిని ఆలయానికి తీసుకురానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లప్ప, సర్పంచ్ నారాయణరెడ్డి, పుత్రాజు, పురుషోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న నడిగడ్డ గ్రామస్తులు

ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ


ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్

యువత ముందుకు రావాలి : జెడ్పీ సీఈఓ

పుంగనూరు: జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో గోకుల్ సర్కిల్‌లో కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీఓ నారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, మహిళలు , సచివాలయ ఉద్యోగులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను పకడ్బందీగా రూపొందిస్తున్నట్టు చెప్పారు. ప్రతి సచివాలయాల పరిధిలో బీఎల్ఓ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులు, మృతుల ఓట్ల తొలగింపును చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు వీటిపై అవగాహన పెంచుకుని తమ కుటుంబాలలో నమోదు, మార్పులు–చేర్పులు, తొలగింపులు ఉన్న పక్షంలో బీఎల్ఓలకు తెలియజేయాలని కోరారు.

శ్రీరామ మందిర అక్షింతలు ఊరేగింపు

చౌడేపల్లె: అయోధ్య శ్రీరామ మందిరం అక్షింతలను శుక్రవారం పురవీధుల్లో మేళ తాళాల నడుమ ఊరేగించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతల ప్యాకెట్లను ఏర్పాటు చేసి సీతా రామలక్ష్మణుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికీ అక్షింతలు అందజేసేలా చర్యలు తీసుకున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు.



జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ఎంతో ఆదర్శనీయంగా నిలిచిందని, ప్రజల ముంగిటకే సేవలు అందించిన ఘనత సీఎంకే దక్కిందని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పట్టణంలోని 15వ సచివాలయ పరిధిలో నిర్వహించారు. సచివాలయంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కొత్తయిండ్లలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లతో కరపత్ర ప్రచారం చేశారు. నియోజకవర్గంలో నవరత్న పథకాలను అర్హులైన పేదలందరికీ అందజేశామని, జగనన్నను మరోసారి ప్రజలందరూ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్ రామకృష్ణంరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జయరాం, కన్వీనర్ వరదారెడ్డి, నాయకులు సురేష్, నవీన్‌కుమార్‌రాజు, అస్లాం మురాధి, అమ్ముకుట్టి తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తదితరులు

కార్మికులకు దుప్పట్లు పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని రోటరీక్లబ్ వంద మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం వేకువజామున మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేసింది. క్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి రాజారెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రోటరీక్లబ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్లు ప్రభాకర్, శరణ్‌కుమార్, ప్రవీణ్, భాస్కర్‌జెట్టి, అర్షద్, వేణుగోపాల్, గణేష్, మునిరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, క్లబ్ ప్రతినిధులు

ఎరుకుల కులస్తుల ఆత్మీయ సమావేశం

పలమనేరు: పట్టణంలో నియోజకవర్గ ఎరుకుల కులస్తుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహించారు. కుల సంఘ నేతలు కోనేటి దివాకర్, బండి రమణ, నాగరాజు మాట్లాడారు. కులస్తులంతా ఐకమత్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవడానికి వీలుంటుందన్నారు. ఇటీవల కొందరు ఎరుకుల కులాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారని, ఇది సరికాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలను మరిన్ని నిర్వహించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మునెప్ప, ఏకుమళై, విజయ్ పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఎరుకుల కులస్తులు

సమ్మె విరమించి విధులకు..


చౌడేపల్లె: అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి


పెద్దపంజాణి: చల్లావారిపల్లెలో అంగన్‌వాడీ సెంటర్ తాళాలు తీసిన సచివాలయ సిబ్బంది


రొంపిచెర్లలో తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ శిరీష

చౌడేపల్లె: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమ్మెను విరమించారు. దీంతో మూడురోజులుగా మూతపడిన కేంద్రాలు తిరిగి తెరచుకున్నాయి. మండలంలోని 66 కేంద్రాలుండగా అన్ని కేంద్రాల సిబ్బంది విధులకు హాజరయ్యారని సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. పిల్లలకు, గర్భవతులు, బాలింతలుకు పౌష్టికాహారం పంపిణీ చేయడంతో పాటు కేంద్రాల సేవలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత సచివాలయ సిబ్బంది శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను తీశారు. మండలంలోని 76 కేంద్రాల తాళాలు తీసినట్లు పలమనేరు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని చెప్పారు. శనివారం నుంచి అన్ని కేంద్రాలు పనిచేస్తాయని ఆమె చెప్పారు. మూడు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేస్తుండటం విదితమే. శుక్రవారం సైతం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి ఎంపీడీఓ అబ్దుల్ రహీంకు వినతి పత్రం అందజేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె పిలుపు మండలంలో ప్రభావం చూపలేదు. మండలంలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు యధావిధిగా నడుస్తున్నాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష రొంపిచెర్ల–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలు ఎంత మంది హాజరు అయ్యారు? పిల్లలకు కోడిగుడ్లు ఇస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో ఎక్కడగానీ కేంద్రాలు మూతపడలేదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అలివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: తమ సమస్యల సాధన కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.


పలమనేరు: ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఇంధన పొదుపులో ఇంజినీర్ల పాత్రే కీలకం

పలమనేరు: ఇంధన పొదుపులో ఇంజనీర్ల పాత్రే కీలకమని తమిళనాడు రాష్ట్రం హోసూరు యునిక్యూ సొల్యూషన్స్ డైరెక్టర్ సురేంద్ర అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఇంధన దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇంజినీర్లకే సాధ్యమవుతుందన్నారు. అనంతరం స్థానిక కళాశాలతో ఆ కంపెనీ ఎంఓయూను కుదుర్చుకుని సంబంధింత పత్రాలను కళాశాల నిర్వాహకులకు అందజేసింది. కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్ సునీల్, డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి, వివిధ శాఖల హెచ్ఓడీలు పాల్గొన్నారు.


అవగాహన ఒప్పంద పత్రాలను ఇస్తున్న సురేంద్ర